## శ్రీ పులుగుర్త రామరాయ కవి విరచిత మాలిక

(తెలుగు పద్యమాలికలకు అల్లసాని పెద్దన ఆద్యులు. అటుపైన వచ్చిన అతికొద్ది మాలికలలో శ్రీ రామారావుగారి మాలిక కూడా గణనీయం)

*శ్రీ నలినోజ్వ్వలన్మధు ఝురీల సమాన తరంగ సంగి భృం*
*గీ నినదంబుకంటె; పిక కీర శిఖావల రాజి రాజిత*
*స్వానము కంటె; సంతత లసన్మహతీ బృహతీ కళావతీ*
*మానిత కచ్ఛ పీక్వణన మాధురి కంటెను; నప్రతీక సం*
*ధ్యా నటనైక కేలి కలనా కుహనా వటు కోత్తమాంగ సం*
*ధానిత సాగరేంద్ర లలనా వలమాన తరంగ ఘుంఘుమా*
*నూన రవంబు కంటెను; మనోహర గాంగ తరంగ డోలికా*
*పీన మృణాళనాళ సరసీజ దళౌదన మోది హంస ని*
*స్వానము కంటె; సౌరభ విభాసిత కల్ప మహీరుహోజ్వలత్*
*సూన సువృష్టి కంటె; పరిశుభ్ర మహీధర శృంగ నిర్గతా*
*హీన నవీన శీకర సమేధ్య పతజ్జలపాత జల్లల*
*ధ్వానము కంటె; బర్హిణ కదంబ మనః ప్రమదానుకల వ*
*ర్షా నవవారిద ప్రకట శబ్దము కంటెను; దానవద్విష*
*న్మానవతీ లసన్నటన మంజుల శింజిత తాల మానస*
*ద్గానము కంటె; నిష్ట వనితా కుచ కుంభ యుగోప గూహనా*
*ధీన నితాంకర్షణ విధి ప్రకటీకృత తార హార సం*
*తాన సముద్భవ త్కలనినాదము కంటె; కపోత పోత కం*
*ఠానయ నిక్వణాఢ్య నలినాయత దృఙ్మగితంబుకంటె; శ్రీ*
*జాని తనూభవ ప్రధన సంగత ఘర్మజలాపనోద వే*
*లా నుతలీ జనాయిత విలాసవతీ వసనాగ్ర చేల నా*
*న్యూన కరాంబుజద్వయ మనోహర కంకణ కింకిణీక ని*
*క్వాణము కంటె; భద్రగజ భాసుర బృంహిత పారశీక హే*
*షా నికరంబు కంటె; నరుసంబయి కోవిద కర్ణపేయమై*
చానలమిన్న హొన్నుజిగి చక్కని చిక్కని చన్నుదోయిపై
జానగు కమ్మ కస్తురి పసందగు చల్లని తావికంటె; నె
మ్మేని జగానిగారముల మిక్కిలు చొక్కపు టెక్కులాడి చె
న్నొ నునుకావిమోవిహరువౌ పలునొక్కుల జిమ్ము తియ్య క్రొం
దేనియకంటె; నాము టెలదేటి చొకాటపు బాట వాటపుం
జానుగుసోకయుల్కి యరుసంబగు గప్రపు దిప్పలెక్కి యెం
తేనన తోట దీటుకొను తేనియ యేటియలంతి కాలువల్
పూనిక డిగ్గి పారు విరిబోడుల కప్రపుటంటి పెందొడల్
పూను బెడంగుకంటె; నెరిపూవులతావులు గ్రోలు గాడుపుం
గూన హొరంగుజూపి తమిగొబ్బున చీరచెఱంగులావలం
గా నెగయింప దోచెడి చొకాటపు టన్నులమిన్న పొక్కిటం
గానగవచ్చు నెత్తరుల గ్రమ్మిన క్రొంజిగి నిగ్గుకంటె; డెం
దాన వలంతి గావలపు నాటిన గుండియ పిండిపిండిగా
గానెటి గౌగిలించుకుని గ్రక్కున జొక్కెడి ముద్దుగుమ్మ ము
ద్దీను హొరంగుకంటె; సెలయేళ్ల కరళ్ల బెడంగుతమ్మి బ
ల్కానల కోనలం దిరిగి కమ్మని పుప్పొడి మేన గ్రమ్మగా
మానుగ నీటితుంపురుల మవ్వపుసోనల దోగిసీతుకుం
దానకమైన సోయగపు తావుల మోపరికూనకంటె; బ
ల్జీను హొరంగు రింగులు పసిండి రికాబులనొప్పు మేలి తే
జీ నడకంటె; జెన్నగుచు చెచ్చెర నిచ్చకు నచ్చునట్లుగా
జానుతెనుంగుకైత నెలజవ్వని నొద్దిక దిద్ది చూపెదన్!

స్మృతి



శ్రీ పులుగుర్త వేంకట రామారావు (1902-64)
శ్రీమతి పులుగుర్త సుబ్బాయమ్మ (1907-73)

*మ॥ తులువల్ వల్వలు కొల్వులో నొలువగా దుఃఖించు నా ద్రౌపదీ*
*లలనారత్నము సంభ్రమంబు దెలియన్ లక్ష్యంబుగానెంతు నీ*
*జలకేళీ విలసద్వధూనివహ వస్త్ర శ్రేణి చౌర్యంబు ని*
*చ్చలునే భూత భవిష్యదర్థ విదభిజ్ఞా కృష్ణ! కృష్ణప్రియా!*

**ఈ** పద్యం శ్రీ పులుగుర్త వేంకట రామారావు రచించిన 'శ్రీకృష్ణ శతకము'లోనిది. భవిష్యత్తులో ద్రౌపదిని తులువల నుంచి కాపాడడానికి ఉపయోగపడతాయని భూతంలో కేళీవిలాసంగా గోపికా వస్త్రాపహరణం చేసిన కృష్ణపరమాత్మను కృష్ణ ప్రియునిగా (ద్రౌపది అభిమానం చూరగొన్నవానిగా) అభివర్ణించడంలో ఎంతో అర్థవంతమైన చమత్కారమూ, విమర్శకులను మురిపించగల భావజాలమూ నింపిన మహాకవి శ్రీ పులుగుర్త వేంకట రామారావు 1902వ సంవత్సరంలో అక్టోబరు 10వ తేదీన తూర్పు గోదావరి జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్రాక్షారామంకు పదమూడు కిలోమీటర్లు దూరంలో వుండే కోలంక గ్రామంలో జన్మించారు. మెట్రిక్ దాకా చదివారు. వారసత్వపుటాస్తి, స్వేచ్ఛా జీవితం వీరిని విలాస జీవితం వైపుకి కాక ప్రజాహిత కార్యక్రమాలు, గుప్తదానాలు, సంప్రదాయ కవిత్వం వైపుకు మళ్ళించడం – వీరి అపురూప వ్యక్తిత్వానికి నిదర్శనం. తన అద్భుత మేధాశక్తికి గురువుల సహకారం, పూర్వజన్మ సుకృతం తోడుకాగా వీరు కవిభూషణ, శతవధాని, మధుర కవి, విద్వాన్, కవిశేఖర, మహాకవి బిరుదులనందుకోగలిగారు. 1934లో వీరు

కుడి ఎడమల ఒకేసారి అష్టావధానాల్ని (ద్విగుణీకృతాష్టావధానం), త్రిథావ్యస్తాక్షరినీ సాధించి తన సాహితీ పాండిత్యంతో కవి పండితుల నబ్బుర పరిచారు.

ఈయన రచనల్లో లభ్యములు : శ్రీకృష్ణ శతకము, శ్రీ సత్యనారాయణ శతకము, పిచ్చి పుల్లయ్య శతకము (శతకాలు); నృసింహరాట్ స్మృతి, రాజ్ఞీ సుభద్రయాంబికా స్మృతి (స్మృతి కావ్యాలు); హంస సందేశము, అమరుకము (అనువాదాలు) పరీక్షి చ్చరిత్ర, రామాయణము, ఉత్తర రామాయణము (ప్రబంధాలు), భోజ రామాయణము, పంచతంత్రము (వచన కావ్యాలు); రామాభ్యుదయము, హైమవతీ పరిణయము (విమర్శలు); భీష్మ యుద్ధము (నాటకం – పలుమార్లు ప్రదర్శితం); చాటువులు. వీరు ఆశు, బంధ, గర్భాది కవిత్వములందు నిష్ణాతులు. సమకాలీనుల్లో శ్రీయుతులు చిలకమర్తి లక్ష్మీనరసింహం, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, వసురాయ కవి, విశ్వనాథ సత్యనారాయణ, కల్లూరి చంద్రమౌళి, విక్రమదేవవర్మ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, కందుకూరి రామభద్రరావు ప్రభృతులెందరో వీరిని ప్రశంసించి ఉన్నారు. వీరు పద్యములను గణానుకూలముగా సంగీత శైలిలో చదవడంలో ప్రత్యేకతను కలిగి ఉండేవారు. విజయనగరంలో భారతీ తీర్థ సభలో శ్రీ రామారావుగారి పద్యపఠనాన్ని భార్యాసమేతుడై విన్న పోస్టు వీలరు అనే అమెరికన్ సెనేట్ మెంబర్ – వీరిని అప్పటి ప్రసిద్ధ అమెరికన్ కవి హేవెల్ లిండ్సేతో పోల్చుతూ 1940 ఏప్రిల్‌లో లేఖా పూర్వకంగా అభినందించాడు. వీరు రచించిన 44 పాదాల మాలికలను ఈ సంచికలోనే చూడగలరు. జయపూర్ రాజా విక్రమదేవవర్మపై వీరు 116 పాదాల మాలికను చెప్పి ఉండడం కూడా అపూర్వ విశేషమే!

శ్రీ రామారావు రామచంద్రాపురంలోని జాతీయోన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేస్తూ ఎందరో పేద విద్యార్థులకు తన యింట ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. వీరు చేసిన గుప్తదానాలకు లెక్కలేదు. స్వగ్రామంలో పాఠశాల లేనందున మధనపడి ఎంతో కృషిచేసి తన స్వంత భూమిని కూడా కొంత దానం ఇచ్చి 1951లో 'పులుగుర్త వేంకట రామరాయ హైస్కూలు' ను నెలకొల్పారు. మూడు సంవత్సరాల అనంతరం పాఠశాల పేరును 'దంతులూరి వెంకట రాయపరాజు ఉన్నత పాఠశాల'గా మార్చడానికి ఎట్టి అభ్యంతరం చెప్పని సహృదయత వారిది. 1954లో ధవళేశ్వరం బోర్డు మిడిల్ స్కూల్‌లో అధ్యాపకునిగా చేరి – వెంటనే అది హైస్కూల్‌గా మారుటకు తన పలుకుబడిని, శక్తి సామర్థ్యాలనూ వినియోగించారు. వీరి జీవిత విశేషాలు, రచనలపై పరిశీలనా – జొన్నలగడ్డ మార్కండేయులు, కాకతీయ విశ్వవిద్యాలయం ఎం.ఫిల్. డిగ్రీకి (1992) సమర్పించిన పరిశోధనా గ్రంథంలో విశ్లేషణాత్మకంగా పొందుపర్చబడ్డాయి. ఆ మహనీయుని సంస్మరణతో 1997 నవంబరులో ప్రారంభమైన 'కథాపీఠం' శీర్షిక మరెందరో మహనీయులను సంస్మరించుకుంటూ నిర్విఘ్నంగా కొనసాగు తున్నది.

శ్రీమతి సుబ్బాయమ్మ రాయవరపు వారింట ఆడపడుచుగా పుట్టి శ్రీరామారావు వ్రేలందుకుని పులుగుర్త వారింట మెట్టి రెండు కుటుంబాల ప్రతిష్ఠకూ పెంపుగా మసలిన మహోన్నత వ్యక్తి. దానధర్మాలతో ఆస్తిని కరిగించివేస్తున్న భర్తకు చేదోడువాదోడుగా ఉంటూ భవిష్యత్తులో శూన్యాన్ని చూస్తున్న పిల్లలకు ధైర్యాన్ని నూరిపోస్తూ మనుమలనూ మనుమరాండ్రనూ కుటుంబపు ఆశాజ్యోతులుగా మలచుతూ ఆమె గడిపిన జీవితం సామాన్యులకందనిది. భర్తకు సుఖాన్నీ, మనశ్శాంతినీ కలిగించడానికి తన జీవితాన్నే అంకితం చేసిన ఆమె గాథ పురాణ స్త్రీలకు సైతం ఆదర్శం కావచ్చు. భర్తకు అనుకూలంగా తన యింట పిన్నలందటరినీ ఏకతాటిపై నడిపించగలిగిన ఆమె సామర్థ్యం మహాత్ములకు మాత్రమే సాధ్యం. ఆధునికతను ఏమాత్రమూ భరించలేని ఆమె ఛాందసత్వంలో మేళవించబడిన మానవత్వం స్త్రీ, దళిత వాదులు సైతం మెచ్చుకునే స్థాయిలో ఉంటుంది. బిడ్డగా, భార్యగా, అమ్మగా, బామ్మగా, అమ్మమ్మగా ఆమె నిర్వహించిన పాత్రలు అనితర సాధ్యం. మాటకు కట్టుబడి తన ప్రథమ సంతానాన్ని జొన్నలగడ్డ వారింటికి దత్తుడిగా పంపాలని భర్త నిర్ణయిస్తే మాట మాత్రం అనకుండా అంగీకరించగలిగిన ఆ త్యాగమూర్తి చలువతో అటు శ్రీరామారావు, ఇటు ఆయన వారసులు మహోన్నత శిఖరాలను అధిరోహించారు. 1964లో భర్త పోగానే జీవితంపట్ల ఆసక్తిని కోల్పోయి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసి అందరూ ఉన్నా ఎవరూ లేరన్నట్లు కృంగి కృశించిపోతూ గడిపిన ఆమె చివరి రోజులు అయినవాళ్ళను కలచివేసినా – ఆమె మాత్రం వానప్రస్థాశ్రమ యోగినిలా మసలి 1973లో కన్నుమూసారు. ఆమెకు స్మృత్యంజలి గతించడంలో నాకు దేవీస్తోత్ర పుణ్యఫలానుభూతి ఉన్నది.

ఈ పుణ్యదంపతుల వ్యక్తిత్వాలు 'వసుంధర' రచించిన మామ్మగారి మనవడు, సుబ్బాయమ్మగారు, పాపంచెయ్ పుణ్య మొస్తుంది నవలల్లోనూ ప్రకృతి వికృతులు, మరో ప్రపంచంలో లక్ష్మణరేఖ కథల్లోనూ తొంగిచూస్తాయి.

## జొన్నలగడ్డ రాజగోపాలరావు

*(బహుమతి అందచేస్తున్నవారు)*

జన్మస్థలం రామచంద్రపురం (తూ.గో.జిల్లా). జన్మదినం 1943లో దీపావళి మరుసటి రోజు. కెమిస్ట్రీలో పిహెచ్.డి. చేశాను. అర్ధాంగి రామలక్ష్మితో కలిసి 'వసుంధర' కలం పేరుతో సాహిత్యానికి చేతనైన సేవ చేస్తున్నాను. సకుటుంబంగా జర్మనీలో ఏణ్ణర్థం పైగా ఉన్నాను. ఇతర దేశాలు కూడా సందర్శించాను. కానీ ఇప్పటికీ రామారావుగారి మనుమడంటేనే నా ఉనికికి గుర్తింపు. మా తాతగారి సాహచర్యం, సాన్నిహిత్యం కారణంగా మహాసముద్రం వంటి ఆయన సాహితీ సామర్థ్యంలోని నీటిబొట్టొకటి మాకు చేరింది. ఆయన వ్యక్తిత్వం, పాండిత్యం, కవిత్వం వగైరాలకు నేను ప్రత్యక్ష సాక్షిని. అరవై ఏళ్ళ వయసులో మొత్తం భగవద్గీత (18 అధ్యాయాలు) కంఠతా బట్టి నాకే అప్పగించుకున్నారాయన. ఆయన పేరిట ఈ తరహా పురస్కారం ఏర్పాటు చేయాలని ఎన్నేళ్లుగానో నా కోరిక. ఇంత కాలానికి సమయం కలిసి వచ్చింది. తలిదండ్రులు జన్మ నిచ్చినా ఈ జీవితం తాతగారు రామారావు, బామ్మ సుబ్బాయమ్మగారు పెట్టిన భిక్షగా భావిస్తుంటాను. నా గురించి ఇక్కడ చెప్పుకోవలసినదింతే!